క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌ల తనిఖీ



పెట్రోల్ విక్రయాలపై ఆరా తీస్తున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో ఉన్న పెట్రోల్ బంక్‌ను మంగళవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌లలో క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్నారా..? అనే విషయంపై ఆరా తీశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపట్టరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హేమాద్రి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లావణ్యం మంగళవారం తెలిపారు. ఓబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. 10వతరగతి ఉత్తీర్ణులు అర్హులన్నారు.

వంద మందికి వైద్య సేవలు



ఓబుళాపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీరామ్ కుమార్

యాడికి: మండలంలోని ఓబుళాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో యాడికి ప్రభుత్వ వైద్యాధికారి శ్రీరామ్ కుమార్ 100 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు 627 మంది రిజిస్ట్రేషన్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు విత్తన వేరుశనగ అందించేందుకు చర్యలు తీసుకుందని ఏఓ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 10 ఆర్బీకేల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ 627 మంది రైతులు 550 క్వింటాళ్ల కే6 వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అలాగే ఈనెల 24 వరకు రిజిస్ట్రేషన్ చేస్తామని, వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు



కవాతు నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

గుంతకల్లుటౌన్: చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య హెచ్చరించారు. పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడటం చట్టవిరుద్ధమన్నారు. మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందితో కలసి ఎన్‌టీఆర్ సర్కిల్, అంజుమన్ స్ట్రీట్, డీఎంఎం గేట్ తదితర ఏరియాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు గొడవల జోలికి వెళ్లకుండా సంయమనంతో ఉండాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

కేబుల్ చోరీ



విద్యుత్ మోటర్ వద్ద కేబుల్ చోరీ జరిగిన దృశ్యం

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు వ్యవసాయ విద్యుత్ మోటర్ల వద్ద కేబుల్‌ను చోరీ చేశారు. గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డి అనే రైతు పొలంలో దాదాపు 150 మీటర్ల కేబుల్ చోరీకి గురైనట్లు మంగళవారం గుర్తించారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.

అన్నదాతకు ఆర్థిక చేయూత

గత ఖరీఫ్‌లో వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు సాగు చేసి నష్టపోతే పరిహారం అందాలంటే రైతులు కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతే రైతన్నలకు సత్వర ఉపశమనం కల్గిస్తూ పరిహారం అందిస్తోంది.

- రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- పంటలసాగు భరోసా కలిగిందని హర్షం



పెద్దవడుగూరు మండలంలో దెబ్బతిన్న పత్తి పంట (ఫైల్)

పెద్దవడుగూరు: ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల అన్నదాతలు నష్టాల పాలయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టింది. సాధారణ ఎన్నికలు నిర్వహించడంతో పరిహారం అందడంలో ఆలస్యమైంది. ప్రస్తుతం ముంగారు వర్షాలు రైతులను ఊరిస్తున్నాయి. చేతి లో చిల్లిగవ్వ లేదు.. పంట సాగుకు ఎవ్వరిని అడగాలి అని దిగులు చెందుతున్న తరుణంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన నష్ట పరిహారం అప్పులు చేసి పంటలను సాగు చేయాలనే దిగులు లేకుండా చేసిందన్నారు. వేరుశనగకు హెక్టారు రూ.17 వేలు, ఆముదం, జొన్న, సజ్జకు రూ.8 వేలు, కంది, అలసందలు, ఉలవలు తరదిర పంటలకు రూ.10 వేలు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నదాతలు కొనియాడారు.

తాడిపత్రి నియోజకవర్గంలో పరిహారం ఇలా..

మండలం	రైతులు	లబ్ధి
తాడిపత్రి	5,465	రూ. 6.90 కోట్లు
పెద్దవడుగూరు	13,906	రూ.12 కోట్లు
పెద్దపప్పూరు	1,505	రూ.1.88 కోట్లు
యాడికి	5,512	రూ .6.44 కోట్లు

పెట్టుబడికి సాయం అందింది



రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇన్పుట్ సబ్సిడీ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం వర్షాలు బాగా వస్తున్నాయి. సాగు చేసుకోవడానికి చేతిలో చిల్లిగవ్వలేదు. దిగాలు పడుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంది.

– అవుకు నాగయ్య, రైతు, యాడికి

కష్టకాలంలో రైతులను ఆదుకున్నారు.



పంటలను సాగు చేయడం కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కాదు. గత ఏడాది వచ్చిన అరకొర పంట కూలీలకు, పెట్టుబడికి కూడా రాలేదు. ఈ సంవత్సరం వర్షాలు ఊరిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం హర్షణీయం. – వెంకట్రాముడుయాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



గత నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. పంటకు పెట్టుబడి కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేశారు. గతంలో అకాల వర్షాలు వచ్చి పంటలు నష్టపోయినా ప్రభుత్వాలు పట్టించుకునేవి కావు. – మల్లికార్జునరెడ్డి, రైతు, పెండేకల్లు, పెద్దపప్పూరు మండలం

'కాలాపురం దేవర'లో ఎమ్మెల్యే వైవీఆర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: మండలంలోని కాలాపురంలో మంగళవారం నిర్వహించిన చౌడమ్మ తల్లి దేవర కార్యక్రమానికి గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. పెమ్మక నల్లపరెడ్డి కుటుంబం నిర్వహించిన ఈ ఇంటిదేవర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు ఎన్.అనిమిరెడ్డి, ఆర్‌సీ రామచంద్రారెడ్డి, పెమ్మక నారపరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పార్థేష్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సత్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉజ్జీవ సువార్త సభలు

పామిడి: పట్టణంలోని బైపాస్ వద్ద క్రీస్తు కల్వరి పరిచర్య ప్రార్థన మందిరంలో రెండు రోజులుగా పాస్టర్ జీ సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షణ ఉజ్జీవ సువార్త సభలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు ముఖ్య ప్రసంగీకులు అనంతపురం ఏఎల్ పాస్టర్ టీఆర్ బాబు ప్రసంగించారు. ఏసు క్రీస్తుతోనే అందరి రక్షణ సాధ్యమన్నారు. అంతకు ముందు క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక గీతాలు అలరించాయి. కార్యక్రమంలో పులివెందుల ప్రాస్టర్ ఓ రుబేను, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు

'నాగేశ్వరావు సేవలు చిరస్మరణీయం'

పెద్దవడుగూరు: కొల్లి నాగేశ్వరరావు పేద ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని మండల సీపీఐ నాయకులు వెంకట్రాముడుయాదవ్, అల్లా బకాస్ అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రామాంజినేయులు, గంగన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ జిల్లా బహిష్కరణ

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన మట్కాబీటర్ అబ్దుల్లాను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు రెండు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.మంగళవారం ఎస్‌ఐ మాట్లాడుతూ అబ్దుల్లా గార్లదిన్నెలో మట్కా రాస్తుండడంతో పలుమార్లు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినా మార్పు రాలేదన్నారు. దీంతో రెండు నెలలు జిల్లా బహిష్కరణ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

రెండు కార్లు ఢీ.. యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో మంగళవారం రెండు కార్లు ఢీకొని నరసింహులు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన నరసింహులు కారులో గుత్తి వైపునకు బయలుదేరాడు. కారు 44వ నంబర్ జాతీయ రహదారిని దాటిస్తుండగా హైదరాబాదు నుంచి బెంగళూరు వైపునకు వెళ్తున్న మరో కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించాల్సిందిగా వైద్యులు సూచించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల ఢీ -ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. గుంతకల్లుకు చెందిన రామసుబ్బయ్య బైక్‌లో గుత్తికి వచ్చాడు. తిరిగి గుంతకల్లుకు వెళుతుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొంది. ఘటనలో రామసుబ్బయ్య గాయపడగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాత కక్షలతో ఘర్షణ - ముగ్గురికి గాయాలు

శింగనమల: మండలంలోని శివపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం పాత కక్షలతో బోయ పెద్దన్న, పత్రా ప్రసాద్ వర్గీయులు దాడులు చేసుకోగా ముగ్గరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయన్నారు. మరోమారు ఇరువర్గాలు ఘర్షణ పడగా ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు.

పెద్దజలాలపురంలో ఇద్దరికి గాయాలు

శింగనమల: మండలంలోని పెద్దజలాలపురం గ్రామంలో రామకృష్ణ, వెంకట వర్గీయుల మధ్య మంగళవారం జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పాతకక్ష్యల నేపథ్యంలో వెంకట వర్గీయులు రామకృష్ణ, రవిపై దాడి చేశారన్నారు. గాయపడిన వారిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పామిడి: ఆడపిల్లల రుతుక్రమ సమయంలో ఐరన్, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే సమతుల ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. మంగళవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికాలయంలో ఆడపిల్లల రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పీడీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రోటీన్లు అధికశాతం గల ఆహారం తినాలన్నారు. నెలసరి సమయంలో నీరు అధికంగా తాగడం వల్ల నొప్పి, కడుపు ఉబ్బరం తగ్గుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం డీసీపీఓ మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, సోషల్ వర్కర్ వసంత, కేజీబీవీ ఇన్‌ఛార్జ్ రుద్రాక్ష, అరుణ, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

తాడిపత్రిటౌన్: బాలికలు కౌమారదశలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, లక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు రుతుస్రావం -ఆరోగ్యం- పరిశుభ్రత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మున్నెమ్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



పామిడి కేజీబీవీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

పంటల సాగులో మెలకువలు పాటించండి

గుంతకల్లు రూరల్: సరైన మెలకువలు, జాగ్రత్తలను పాటిస్తూ ఖరీఫ్ పంట సాగు పనులు చేపట్టాలని ఆత్మ పీడీ మద్దిలేటి, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శైలజ సూచించారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో ఏఓ స్వాతితో కలసి వారు ఆర్బీకే సిబ్బంది, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు భూమిలోనే ఇంకిపోయేలా రైతులు పొలాలను దుక్కి చేసుకోవాలని సూచించారు. వేరుశనగ, కంది, ఆముదం సాగులో అధిక దిగుబడులను ఇచ్చే మేలైన రకాల విత్తనాలను ఉపయోగించాలని సూచించారు. సాగుకు ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ పంటల సాగులో ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సూచనలివ్వాలన్నారు. అనంతరం కలుపు నివారణ, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆవులతిప్పాయిపల్లి సమీపంలో ఉన్న ఓబులేసుకోనలో బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, పూల హారాలతో అలంకరించి వేదమంత్రాలు, నడుమ మంగళవాయిద్యాల నడుమ వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం ఆలయ వీధుల్లో స్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా అమ్మవారి పుష్పార్చన



అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పుష్పార్చన దృశ్యం



పల్లకీ సేవలో ఆర్యవైశ్యులు

గుంతకల్లు: స్థానిక కన్యకాపరమేశ్వర ఆలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారి పుష్పార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మండపంలో కొలువుదీర్చి వేద పండితుల ప్రత్యేక పూజాలు చేశారు. ఈ సందర్భంగా 108 మంది దంపతులచే వివిధ రకాల పుష్పాలతో విశేష పుష్పార్చన గావించారు. అనంతరం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. మహమంగళ హారతి గావించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చోరీ ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామ శివారులో వ్యవసాయ మోటార్ చోరీ జరిగిన ప్రదేశాన్ని మంగళవారం పోలీసులు పరిశీలించారు. గ్రామ శివారులోని పొలానికి నీటిని సరఫరా చేసేందుకు మోటారు, పైపు లైన్ ఏర్పాటు చేశానని, గుర్తు తెలియని దొంగలు మోటార్‌ను చోరీ చేశారని బాధిత రైతు హరినాథ్ ఎస్‌ఐ నబీరసూల్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు గ్రామ శివారులోని పుల్లెటి వాగు వద్దకు వెళ్లి రైతులతో ఆరా తీశారు. ఈ నెల 18 రాత్రి చోరీ జరిగిన ప్రదేశంలో టవర్ లోకేషన్ ఆధారంగా ఏ ఏ కంపెనీల సిమ్ నంబర్లు అక్కడ ఉన్నాయో చూశారు. అనగానదొడ్డి, పి.ఎర్రగుడి, పెద్దొడ్డి గ్రామాల రైతులకు చెందిన మోటార్లు, స్టార్లర్లు, పైపులు పలుమార్లు చోరీకి గురి అయ్యాయని, విచారణ చేసి దొంగలను పట్టుకోవాలని రైతులు పోలీసులను కోరారు. మోటార్లు, పైపులు చోరీ అయిన ప్రతిసారీ మూడు రోజుల పాటు నీరు అందించక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

విజయోత్సవాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పుట్లూరు: ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాల పేరుతో బాణాసంచా పేల్చినా, ర్యాలీలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని శనగలగూడూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఎస్‌ఐ హేమాద్రి ఉన్నారు.

రేపు మాన్యం భూముల వేలం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో ఉన్న బొలికొండ రంగనాథస్వామి ఆలయ మాన్యం భూములు కౌలుకు ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రాణి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వే నంబర్ 643లోని 8.04 ఎకరాలను రైతులు కౌలుకు తీసుకునేందుకు వేలం వేస్తామన్నారు. ఆలయ ఆవరణలో ఉదయం 11:30 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు రూ.1,000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

పలువురిపై బైండోవర్ కేసులు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురానికి చెందిన టీడీపీ నాయకుడు పట్నం నగేష్, ఆయన అనుచరులు, ఈస్ట్ నరసాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆయన అనుచరులుపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. పట్నం నగేష్ వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నప్పుడు, బొమ్మన శ్రీరామిరెడ్డి అనుచరులతో కలిసి వర్కులు చేశారు. ఇందుకు సంబంధించి ఆర్థిక విషయాలను మంగళవారం బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆయన అనుచరులు పట్నం నగేష్‌ను అడగడంతో వాగ్వాదం జరిగింది. దీనిపై ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

గుత్తి: పట్టణంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో బుధవారం కర్నూలుకు చెందిన మోడ్రన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కంటి పరీక్షలు చేస్తారన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠ్యపుస్తకాలు భద్రపరిచిన దృశ్యం



పెద్దవడుగూరు జెడ్పీ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మంగళవారం పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. పుస్తకాలను స్టాక్ పాయింట్‌లో భద్రపరిచామన్నారు. ప్రస్తుతం 1 నుంచి 7 వతరగతి వరకూ 9,053 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. అలాగే 8, 9, 10 తరగతి వరకూ విజయవాడ నుంచి అన్ని సబ్జెక్టుల పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పుస్తకాలు త్వరలోనే వస్తాయన్నారు.

పెద్దవడుగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంగళవారం పెద్దవడుగూరు మండలానికి పాఠ్య పుస్తకాలు చేరాయి. వాటిని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతం మొదటి విడతలో 1వ తరగతి నుంచి 7 వ తరగతి వరకూ 6,600 పుస్తకాలు వచ్చాయన్నారు. త్వరలోనే అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ వస్తాయన్నారు.